# అన్నమ్మ

"అటువంటి మనిషిని మరి చూడబోం" అంది కస్తూరి.

ఆ ఒక్క ముక్కే చాలు అన్నమ్మ మంచితనాన్ని గురించి చెప్పడానికి అన్నట్టుగా. స్నానం చేసొచ్చి వాకిట్లో యీజీఛైర్‌లో కూర్చుని పత్రికను విప్పబోతూ ఆమె చెప్పిన వార్తకు అచేతనంగా వుండిపోయాను.

డాబా మెట్ల మీద కూర్చుని మావిడిచెట్టు వైపు చూస్తోంది కస్తూరి. ఆప్తులైన వారు దూరమైతే కలిగే బాధేదో ఆమెలో కనిపించింది.

పది రోజుల క్రితం వరకూ యిక్కడే వుందిట అన్నమ్మ. పండక్కి కూతుర్నీ, కొడుకునీ చూడ్డానికి వాళ్ల వూరు వెళ్లిందట. అక్కడ జ్వరమొచ్చి రెండు రోజులు మంచం మీద కదల్లేని పరిస్థితిలో వుండిపోయిందట. మూడో నాడు తనను పట్నం తీసుకుపొమ్మని గోల పెట్టింది. మరో రెండు రోజులకే కన్ను మూసిందట.

ఎప్పుడూ మంచాన పడని మనిషి. నిరంతర యంత్రంలా తిరుగుతూ పనులు చేసే మనిషి.

ఇంత జనాభా వున్న యీ పట్నంలోని యీ కాలనీలో ఎవర్ని కదలేసినా అన్నమ్మ సంగతి చెబుతారు. అందరూ మంచిగానే చెబుతారు.

జ్ఞాపకాల పుటలు మనసులో ఒకటీ ఒకటీ కదుల్తున్నాయి.

పదిహేనేళ్ళ క్రితం ఇక్కడి జాగాలో యిల్లు కట్టే ప్రయత్నంలో స్థలంలో వున్న

పిచ్చి మొక్కల్నీ రాయీ రప్పల్నీ సరిచేయించి మార్కింగు చేయించే పని మీద వచ్చిన తొలి రోజునే వచ్చింది.

"ఏటి బాబూ, ఇల్లు కడుతున్నారా?" అంటూను.

ముదరాకు పచ్చ ముతక చీర, అడ్డ కొప్పు, నుదుటి మీద అర్ధరూపాయంత బొట్టూ. మాటలో మనిషి పట్ల మన్ననా ప్రత్యేకంగా కనిపించింది.

"అవును" అంటూ నా పనిలో నేను లీనమయ్యేను. వెళ్ళిపోకుండా కాసేపు అక్కడే నిలబడి పని కుర్రాళ్ళకి మొక్కల్నీ, కంపల్నీ వెనుక స్థలంలో కుప్ప పెట్టమనీ, రాళ్ళన్నీ ఒక దగ్గర వేస్తే పనికొస్తాయనీ చెప్పింది. కొలతలు తీసేటప్పుడు మనిషి తక్కువైతే తనే తాడు పట్టుకుంది. ఓ అరగంట అక్కడ గడిపి వెళ్ళిపోయింది.

శంకుస్థాపన రోజున మళ్ళీ ఎదురై, "ఏం బాబు బాగున్నావా" అనడిగింది. అక్కడ కావల్సినవి క్షణంలో అమర్చి పెట్టింది. రెండు బిందెలతో నీళ్ళూ, రెండు బల్లలూ అక్కడ పెట్టింది. "నీకేటి కావల్సినా అడుగు – ఆ ఎదురింట్లో ఇంజనీరుబాబు గారింట్లో నేనుంటాను. 'అన్నమ్మా' అని కేకేసినా చాలు" అంది. ఆనాటి కార్యక్రమం అయ్యేక తోచిందేదో చేతిలో పెట్టబోతే, "డబ్బులా? నా కెందుకు బాబూ, ఏటి జేసినానని? ఇద్దువులే తర్వాత" అందిగాని తీసుకోలేదు. అప్పుడే ఆశ్చర్యమనిపించింది అలాంటి మనుషులింకా వున్నారా అని!

పునాదులయ్యేయి. గోడలు లేచేయి. స్లాబు కూడా తొందరగానే వేయడం జరిగింది. వాచ్‌మన్ కాక స్లాబు తడపడానికీ, దగ్గర్లో వున్న బావి నుంచి నీళ్ల తోడి తీసుకురావడానికీ మనిషిని కూడా పెట్టేం. ఉదయం డ్యూటీకి వెళ్లే ముందు, సాయంకాలం డ్యూటీ నుండి వచ్చేటప్పుడూ వెళ్ళి చూడడం అలవాటైంది. స్లాబు వేసిన అయిదో రోజు సాయంకాలం నే వెళ్ళే సరికి వాచ్‌మెన్ లేడు. నీళ్ళు పోసే మనిషి బావి దగ్గరున్నాడు. ఇంతలో అన్నమ్మ వచ్చింది. "ఏం బాబూ బాగున్నావా" అంటూ. ఎప్పుడూ అదే కుశల ప్రశ్న జవాబుగా తలూపేను.

"అమ్మగోర్ని కూడా తీసుకురాలేకపోయావా" అంది.

"పిల్లలు, స్కూళ్ళూ కదా, ఆవిడ రావడం కష్టంలే" అన్నాను.

"బాబూ నే చెప్పేననుకోకపోతే ఓ మాట చెప్పనా" అంది.

ఏంవిటన్నట్లు చూశాను.

"స్లాబుకి పూరాగా నీళ్ళుండాల బాబూ. ఈ ఇరవై రోజులెట్టిందే దానికి బలం. ఆ తర్వాత ఎంతెట్టినా ఒకటే. ఒక చుక్క కూడా పీల్చుకోదు. అంచేత...." అంటూ ఆగింది.

అన్నమ్మ చెప్పేదేమిటో అర్థమైంది.

"బాగానే తడుపుతున్నారుగా" అన్నాను. ప్రత్యేకంగా ఆ పనికి ఓ మనిషిని పెట్టానన్న ఉద్దేశంతో.

"ఏటి తడపడం బాబూ. ఆ సిలకన్నగాడొట్టి దొంగ. నీ కాడ నీ మాట... నా

కాడ నా మాట. బతకనేర్చినోడు. నువ్వొత్తావని ఆ టయాంకి నీళ్ళట్టుకొచ్చి పోస్తాడు. అంతే! అనక మరుండడు. వాచిమెన్ని కూడా మాటల్తో బుట్టలో ఎట్టీగల్డు. రెండు కావిళ్ళు యిటేసి, నాలుక్కావిళ్ళు అటు అమ్ముకుంటే డబ్బులొస్తాయి. నీకేటీ తెల్దని చెప్పినాను. మద్దెనాల ఓపాలి అమ్మగోరైనా వత్తూంటే బాగుంటాది" అంది.

అన్నమ్మ వెళ్ళాక చిలకన్నని పిల్చి అడిగేను. స్లాబుకి నీళ్ళు సరిపోతున్నాయా అని.

"అసలు స్లాబు నారనీటం లేదు బాబూ చూస్తున్నారుగా. నీళ్ళెలా కారుతన్నాయో" అన్నాడు.

ఆ మర్నాడు మధ్యాహ్నం ఆఫీసుకు సెలవు పెట్టి రెండు గంటల ప్రాంతంలో వచ్చేను. వాచ్‌మెన్ వాళ్ళ బంధువులెవరికో వంట్లో బాగోలేదని చూడ్డానికి వూళ్ళోకెళ్ళేడట. వాడి పెళ్ళాం చెప్పింది. స్లాబు చూస్తే బాగా పొడారిపోయి ఉంది. చిలకన్న వచ్చిన జాడ లేదు. అక్కడే కూర్చున్నాను. నాలుగు గంటల ప్రాంతంలో కావిడి నీళ్ళతో వచ్చి నన్ను చూసి గతుక్కుమన్నాడు చిలకన్న. ఆ వెంటనే నిలదొక్కుకుని, "ఎంతసేపైంది బాబూ మీ రొచ్చి" అడిగాడు.

"ఇప్పుడేలే" అన్నాను.

"రేసనుసాపోడు బాబూ. సరుగులియ్యకుండా తిప్పుతున్నాడు. డిపో ఎప్పుడు తెరుస్తాడో ఎప్పుడు మూస్తాడో తెల్దు. ఉదయమెల్తే సాయంకాలమూ, సాయంకాలమెల్తే మరుసటి రోజూ రమ్మంటాడు. మా ఆడదాని బాధ పళ్ళేక ఎళ్ళేను. స్లాబు బాగా నీరు పీల్చుకుంటంది బాబూ. ఈ కాసింత సేపట్లోనే ఎలాగారిపోయిందో చూడండి." అంటూ పైకెక్కి నీళ్ళు పొయ్యడం మొదలుపెట్టేడు. మనుషుల్ని నమ్మి ఇల్లు కట్టుకోడమంత బుద్ధి తక్కువ పని మరోటి లేదనిపించింది.

ఏమైనా అంటే తగువు. మాట పడరు. నిజాయితీ ఉండదు. తప్పు ఒప్పుకోరు. అక్కర్లేకపోతే మానిపించేసుకోండి అంటారు. అలా అని మరొకరిచేత చేయించుకోనివ్వరు. సాయంకాలం వచ్చేస్తూంటే దారిలో కనిపించింది అన్నమ్మ, "ఏం బాబూ" అంటూ. అదే పలకరింపు.

"అన్నమ్మా. నువ్వు నాకు సాయం చేసి పెట్టకూడదూ?" అన్నాను.

"ఏటి బాబూ" అంది అర్థం కాని దాన్లా.

"మా స్లాబుకు వాటరింగు నువ్వు చేసి పెట్టకూడదూ. నెల జీతం యిస్తాను" అన్నాను. అన్నమ్మ చిన్న నవ్వు నవ్వింది. 'అదా' అన్నట్లు

"చిలకన్న కావిళ్ళతో నీళ్ళు తెచ్చి డ్రమ్ములు, కుండీలు నింపుతాడు. నువ్వు బకెట్‌తో తోడి తడిపితే చాలు. నీ మీద నాకు నమ్మకం. అందుకనీ" అన్నాను.

"అవునుగానీ నాకెలా కుదుర్తాది బాబూ పన్లోకెళ్ళొద్దా" అంది.

"ఆ జీతమేదో నేనే యిస్తానుగా" అన్నాను.

ఫక్కున నవ్వింది అన్నమ్మ.

"అదిగో ఆ కొండోర అవుపిస్తంది గదేటి మేడ అదే మా కంట్రాట్టర్ బాబుది. ఆ బాబు కాడ ఇయ్యాలా? నిన్నా? నాలుగేళ్ళయ్ చేస్తన్నాను. ముప్పయ్ రోజులూ పనున్నా లేక పోయినా మస్తరేసి జీతమిస్తాడు. రోజువారీ కూలి కెల్తే ఎక్కువ ముడతాదనుకో. కాని ముప్పయ్ రోజులూ పనుండొద్దూ? సాయంకాలం ఒచ్చిందగ్గర్నించీ అదిగో ఆ యింజినీరు బాబు గారింటే సరిపోద్ది. ఆళ్లింట్లో పనంతా నేనే చేత్తాను మరి. ఆళ్ళ పాపకి నేనంటే మా చెడ్డ యిది. నన్నిడిచి ఉండదు. ఆ రెండు రోజులూ నాను పన్లోకెళ్ళలేదు కాబట్టి ఆ సిలకన్నగోడి నాటకాలు నా కంటబడ్డాయి గానీ..." అంటూ మరోమాటకి ఆస్కారమివ్వకుండా చెప్పింది.

మా ఇంటి గృహప్రవేశం నాడూ అన్నమ్మ మాకు చాలా సాయం చేసింది. పది రోజుల ముందే అన్నమ్మతో చెప్పేను – "నువ్వా రెండు రోజులూ మా ఇంటి దగ్గరే కాస్త కనిపెట్టుకు వుండాలి సుమా?" అని.

"రెండు రోజులు కాదుగానీ ఆ రోజుంటాను. నా పనేటైనా వుంటే సెబితే రాత్రిళ్ళు చేత్తాను" అంది.

చెప్పినట్టే ఆ రోజంతా మా యింటి దగ్గరే ఉండిపోయింది. వంట బ్రాహ్మడికి కర్రలందించీ, ఇల్లూ వాకిలీ శుభ్రం చేసీ, అంట్ల గిన్నెలు తోమించీ, తోమిన సామాను లోపల పెట్టించీ, వచ్చిన అతిథుల కోసం కుర్చీలందించీ – ఇలా ఒక పని కాదు అన్ని పన్లూ తన స్వంత పనుల్లాగే నమ్మకంగా శ్రద్ధగా చేసింది. "చేసిందానికి ఏమివ్వమంటావ్" అని అడగటానికి నోర్రాలేదు. పనికి విలువ కట్టగలమేమోగాని మనిషిలోని నిజాయితీకి, నమ్మకానికీ విలువ కట్టడం కష్టం. మాకు తోచింది యివ్వబోతే –

"డబ్బా. ఉంచుకోబాబూ. తర్వాతెప్పుడన్నా తీసుకుంటాను" అంటూ నవ్వేసి వెళ్లిపోయింది.

ఆ తర్వాత మేమేం యిచ్చామో... తనేం తీసుకుందో ... అంత పెద్ద మనసు అన్నమ్మది! డబ్బు కోసమే మనుషులు జీవిస్తున్న ఈ రోజుల్లో ఏమైనా కలిసొస్తుందంటేనే ఎదుటి వారితో మాట్లాడే రోజుల్లో అన్నమ్మ లాంటి వారు అరుదనే చెప్పాలి.

◆ ◆ ◆

కొత్తింటికి మారిన కొన్ని నెలల దాకా సరైన పనిమనిషి దొరక్క కస్తూరి చాలా యిబ్బంది పడింది. వూడవడం రానివాళ్ళూ, అడ్డపొగ పెట్టుకునే వాళ్ళూ, వచ్చేవారు పని కోసం. ఏం పని చేయాలో తెల్సుకోకుండానే, "ఎంతిస్తావ్" అనడిగేవారు. రోజు వారీ కూలికి వెళ్ళినా అన్నమ్మ ఇంజనీరు గారింట్లో పనంతా కుదురుగా చక్కగా చేసేది. తెల్లారే సరికి కల్లాపి జల్లి ముగ్గు వేసేది. ఇత్తడి గిన్నెల్ని మెరిపింపచేసేది. పిండి మర కెళ్ళడం, రేషను తేవడం వంటి పనులు చేసేది. చివరికి కారు కడగటం కూడా చక్కగా కడిగేది.

"పని మనిషంటే అలా వుండాలి. అలా పని చేసే వాళ్ళకి ఎంతిచ్చినా, ఏం పెట్టినా బాధనిపించదు. మనకి దొరికిన వాళ్ళూ వున్నారు. అంట్ల గిన్నెలకి జిడ్డు లొదలవు.

చీపుర్లను వీధిగుమ్మంలోనే పడేసిపోతారు" అంటూ వాపోయేది కస్తూరి.

"పోనీ ఆ అన్నమ్మనే అడక్కపోయావా ఎవరినైనా సరైన మనిషిని కుదిర్చిపెట్టమని" అన్నానో మారు. నా సలహా బాగానే పనిచేసింది. కస్తూరి అడిగితే, "మరి సెప్పుకోవటమ్మా. ఎవులో సేస్తన్నారని వూరుకుండిపోనాను. సూస్తన్నానుగా ఏ గుంటకీ సీపురట్టుకోడం రాదు. మంచి మనిషిని తెత్తాలే. అందాకా నువ్వేటి సేసుకుంటావ్. అసలే అర్భకం దానివి. ఎవులేనా ఒచ్చే వరకూ నేను సేసిపెడ్తాలే. ఎంత పని గనక?" అని మాటిచ్చి నట్టుగానే కొన్నాళ్ళు తనే ఏ యిబ్బంది పడో చేసింది.

ఓ రోజు తన వెంట ఓ పదేళ్ల పిల్లని వెంట బెట్టుకొచ్చింది. మాసిన పరికిణా, జాకెట్టు వేసుకున్న ఆ పిల్ల ముఖంలో అమాయకత్వమేగాని గడుసుదనం లేదు.

"ఇదిగోనమ్మా ఇది చేస్తాది మీ యింట్లో పని" అంటూ ఆ పిల్ల గురించి చెప్పింది. అదీ, అన్నమ్మా ఒక వూరి వాళ్ళేనట. ఆ పిల్ల తండ్రి తెగ తాగి బస్సు కింద పడి చచ్చిపోయాడట. ఉన్న తల్లి కూడా అనారోగ్యంతో యీ మధ్యే కన్ను మూసిందట.

"దీంచేతిలో పనుంది. ఏటి చెప్పినా చేస్తాది. పోనీ నాలుగిళ్ళలో పని జూపిస్తే బతుకుతాదని తెచ్చి నా పాకలోనే వుంచినాను. నాల్రోజులు పని చూడు. నచ్చితేనే చేయించుకో" అంది అన్నమ్మ.

ఆ పిల్లేం చేస్తుందిలే అనుకున్నాం మొదట. కానీ అదే చేసింది మా యింటి పనంతా పదేళ్ళపాటు. అది ఏ ఒక్క రోజు రావడం మానేసినా అన్నమ్మే వచ్చి చేసేది. అలా మధ్య మధ్యలో చేసిన పనికి డబ్బులు కూడా తీసుకునేది కాదు.

◆ ◆ ◆

ఏ మూడు నెలలకో, ఆర్నెల్లకో ఒకమారు అన్నమ్మ వాళ్ళ వూరెళ్ళేది. వెళ్ళే ముందు ఆ కాలనీ అంతా చెప్పేది. ఎన్నో అప్పగింతలు పెట్టేది. కూతురికేదో పెట్టాలి గదా అనేది. కొడుక్కేదన్నా తీస్కెళ్ళాలిగదా అనేది – అసలే అవిటోడు – అనేది. అన్నమ్మ సహాయాన్ని పొందినవాళ్లు, "ఊరెల్తున్నావుగదా. ఇది వుంచు. ఖర్చుకి పనికొస్తుంది" అని పదో పరకో యిస్తే కాదనకుండా ఆనందంగా తీసుకునేది. అంతేగాని ఇవ్వాల్సిన వాళ్ళని కూడా నోరిప్పి అడిగేది కాదు.

"వూరెళ్ళేక అక్కడెలగుంటదో... ఎప్పుడొస్తానో" అనేది.

"నువ్వు రాకపోతే మాకెలా" అని ఎవరన్నా అంటే –

"నాకు మాత్రం ఎలాగేటి? నానిక్కడ సంపాదిస్తేనే గదేటి ఆళ్ళక్కడ సుకపడేది! ఆళ్ళకోసమే నా కష్టమంతానూ" అనేది. తన కుటుంబాన్ని పోషించుకుని ఓ కొలిక్కి తేవాలనే పట్టుదల అన్నమ్మలో కనిపించేది.

"వాళ్లక్కడ, నువ్వొక్కతివీ ఒంటరిగా ఇక్కడ. ఎన్నాళ్ళిలా అన్నమ్మా" అని అంటే–

"నాదెప్పుడూ ఒంటరి బతుకేలే, సిన్నప్పుడే అమ్మా అయ్యా పోయేరు. పెంచిన ముసిల్ది మద్దెలోనే పోయింది. సెప్పుకోడానికి వున్నార్లే గానీ, ఎందుకూ? నా బతుకు నాను బతగ్గలను. కన్నందుకు అడపిల్లకి పెళ్ళి చేయాల. మరి పిల్లాడికో దారి చూపాల"

అని, –

"అయినా నానేం ఒంటరిదాన్ని? అక్కడ మావోళ్లంతా వున్నారు. ఇక్కడ మీరు లేరా?" అనేది!

అన్నమ్మకి భర్త వున్నాడో లేడో తెలీదు. ఆ ఇద్దరు బిడ్డలు కలిగేక సైన్యంలో చేరేడంటారు కొందరు. దేశాలు పట్టిపోయాడంటారు కొందరు.

"ఆడు నా సిన్నతనాన నా జీవితంలో కొచ్చేడు. ఇప్పుడు గేపకాల్లో కూడా లేడు" అంటుంది అన్నమ్మ, ఆ విషయమై ఎవరైనా మరీ గుచ్చి గుచ్చి అడిగితే.

ఎప్పుడో చుట్టపు చూపుగా పట్నమొచ్చిన అన్నమ్మకు అనుకోకుండా ఓ కాంట్రాక్టరు దగ్గర పని కుదిరి వుండిపోయిందట. పల్లెటూళ్ళ కన్నా పట్నంలో పనిచేస్తేనే నాలుగు పైసలు వెనకేసుకోవచ్చున్న ఉద్దేశ్యంతో. అంతే! అదే స్థిరమైపోయింది.

స్వంత వూరు వెళ్ళినప్పుడల్లా ఓ వారం రోజులో పది రోజులో ఉండి, వచ్చేటప్పుడు కూతుర్నో, కొడుకునో, మరొకర్నో తనతో వెంట తీసుకొచ్చేది. ఇరవై రోజులో, నెల్లాళ్ళో వుంచుకొని పంపేది. తన కోసం ఎవరినీ ఏమీ అడగని అన్నమ్మ వాళ్ళెవరేనా వుంటే, "కూరేటైనా ఉందేటీ? నానైతే ఎలాగైనా తింటాను" అని అడిగి తీసుకెళ్ళేది. వచ్చిన వాళ్ళని గొప్పచేసేది!

"మా బాబూగోరు యీ కాలనీలోనే మేడ కడతారండి" అంది అన్నమ్మ ఓ రోజు నాతో. బాబుగారంటే తను పనిచేసే కంట్రాక్టరు గారన్నమాట.

"ఇక్కడా! స్థలమెక్కడిదీ?" అన్నాను ఆశ్చర్యంగా. గడిచిన ఐదేళ్ళలో కాలనీలో ఖాళీగా వున్న చాలా స్థలాల్లో ఇళ్ళొచ్చేశాయి.

"స్థలముంది – ఆ బాబెప్పుడో కొన్నాడు. నాలుగంతస్తుల మేడ కడతారంట. మరి నలుగురు పిల్లలు కదా" అని, –

"అవును బాబూ నువ్వెయ్యవా మేడ?" అడిగింది.

"నెలజీతగాళ్ళం. మేడలెలా వేస్తాం? దీనికి తీసుకున్న అప్పే వడ్డీతో సహా తీర్చుకునే సర్కి జీవితం సరి" అన్నాను.

"అవున్లే నెల జీతాల మీద కష్టమే. అవతలీదిలోని పోస్టుమాస్టరుగారు కూడా అంతే. చిన్న యిల్లు కట్టుకున్నాడు. ఏటి బాబూ మరీ మూడు గదులేనా అని నానంటే 'నలుగురాడపిల్లలకి చదువులూ, పెళ్ళిళ్ళూ చూడొద్దా' అంటారు. మా మంచి కుటుంబం. మంచోరు. నానంటే పేణం. అయితే మా కాంటాట్రు బాబు గోరికంటే మాలచ్మి అలా వస్తానే వుంటాది. నాలాటోళ్ళని ఓ యాభై మందిని పోషిస్తున్నాడు జీతాలిచ్చి. బాబుగారికీ నేనంటే మా యిది. నా మాట మీద మా వూరోళ్ళకి నలుగురికి పనులిచ్చేడు" అంటూ గొప్పగా చెప్పింది.

ఇంజనీరుగారి ఒక్కగానొక్క అమ్మాయికీ పెళ్ళి కుదిరింది. రెండు లక్షలు కట్నం.

అల్లుడు కూడా ఇంజనీరే. ఆ విషయం చెబుతూ, "పెళ్ళికి నెట్రోజులు పూరాగా యిక్కడే ఉండిపొమ్మన్నారు. నాకెలా కుదుర్తాదీ? అవతల మా బాబుగోరి బిల్డింగ్ కాడ ఎవులుంటారు? వాట్రింగు నేనే సెయ్యాల మరి! అంచేత ఓ వారం పూరాగా ఉండిపోతా నన్నాను" అంది అన్నమ్మ.

అన్నమ్మ అన్ని విషయాలూ మాతో చెబుతుంది. మాకు చెప్పినట్టే అందరితోనూ చెబుతూందేమో మరి. అయితే అక్కర్లేని విషయాలు మాట్లాడదు. ఒకరిపై చెడుగా చెప్పదు. చాడీలసలే చెప్పదు. ఉన్న మంచినే కాస్తంత ఎక్కువ జేసి చెబుతుంది. మనుషుల్ని తక్కువ చేసి మాట్లాడడం ఆమెకు చేతగాదు. ఎవరి కష్టాల్ని వారితో పంచుకుంటుంది. తన కష్టసుఖాలు చెప్పుకుంటుంది.

ఆ పెళ్లికి ముందు వారం రోజులూ అన్నమ్మ చేసిన హాడావుడే హాడావుడి.

ఓ రోజు పని కుర్రాడెవడో కారు కడుగుతున్నాడు. ఈలోగా అన్నమ్మ అక్కడికొచ్చింది.

"ఏట్రా ఆ కారు కడగడం? ఆ అద్దాల మీద సేతులానించడమేటీ? అదిగాని పగిలిపోనాదంటే నీ జీవిత కాలం వూడిగం చేసినా తీర్చగలవేట్రా?" అంటూ పైపును వాడి చేతి లోంచి లాక్కుని, "ఇదిగో ఇలా కడగాల్రా. పెళ్లి కారు అద్దంలా మెరిసిపోవాల" అంటూ కడిగి చూపెట్టింది.

అన్నమ్మ చేసిన ప్రతి పనిలోనూ శ్రద్ధ కనిపించేది. ఎవరికేపని చేసినా అది తన స్వంత పనిలా భావించి చేసేది.

"వచ్చే మాఘమాసంలో నా కూతురి పెళ్ళి" అంది అన్నమ్మ ఓ రోజు మా యింటికొచ్చి.

"అదేంటి? నువ్విక్కడే వున్నావు. సంబంధం ఎప్పుడు చూశావు? పెళ్ళెప్పుడు నిశ్చయించావు?" అనడిగింది కస్తూరి.

"నానెక్కడుంటేనేటి? కుర్రాడు మా వూరోడు. మంచోడు. వ్యవసాయప్పన్లు చేస్తాడు. తల్లి ఉంది. ఉంటానికో కొంప ఉంది. ఎప్పట్నించో మా యమ్మిని చేసుకుంటానంటన్నాడు. 'అలాగేలేరా నాలుగు డబ్బులుసంపాయించు' అనేదాన్ని. ఇప్పుడు పర్లేదులే. ముసిల్ది కూడా మంచిదే. మా యమ్మిని కడుపులో పెట్టుకు చూసుకుంటాది. అదక్కడ సుకపడతాదని సరే నన్నాను" అంది.

పెళ్ళి రెండు నెలలుందనగా ఓ మారు వాళ్ళ వూరెళ్ళి పది రోజులుండి వచ్చింది.

"అప్పుడే పెళ్ళి పనులు మొదలేట్టేశావా అన్నమ్మా" అంటే -

"మరి కాదా? అల్లుడోడి కొంపేం బాగా లేదు. కమ్మలేయించినాం. తూర్పేపు మట్టిఓడ పడిపోతుంటే కొత్తది ఎట్టించినాం. సున్నం రాయించినాం. ఆ సేత్తోటే మా యింటికీ సున్నం ఏయించినాను" అంది.

"పెళ్ళికి ముందే అల్లుడిల్లు బాగుచేయించేవా" అనంటే-

"మరి రేపు నా కూతురుండేది అక్కడ్నె గదేటి" అనేసి నవ్వేసింది.

పెళ్ళి నెల రోజులుందనగా తెల్సిన అందరికీ చెప్పింది. కూతురికి ఏమేమిటి కొనాలో, పెళ్ళెలా చేయాలో అన్నీ చెప్పేది. రెండు వారాలుందనగా బయల్దేరింది వాళ్ళ వూరు. తెలిసిన వాళ్ళెవరూ అన్నమ్మను ఉత్తి చేతుల్తో పంపలేదు.

"ఇది ఉంచు అన్నమ్మా. పెళ్ళికే వాడతావో నీ కూతురికే యిస్తావో" అని ఓ వంద రూపాయలు ఆమె చేతిలో పెట్టింది కస్తూరి.

"అలాగేనమ్మా. నీ సల్లని సేతుల్తో యిచ్చినావు. అదే సాలు. బాబు పేరు ఓ చీటీ మీద రాసిచ్చినావంటే పెళ్ళిలో కట్నాల కాడ సదివిస్తాను" అంది.

"చదివింపుల్లో ఎందుకులే" అనంటే –

"అలగనీకమ్మా. అందరి పేర్లూ ఒట్టుకెల్తన్నాను. నానీయాళ కూతురు పెళ్ళి సేస్తన్నానంటే అది మీలాంటోల్ల దయే. మంచితనమే. ఏటుందిపోద్ది? తిన్నదుండదు. కట్టుకున్న దుండదు. ఎట్టిందే వుండిపోద్ది. మంచే ఉండిపోద్ది" అంది.

కూతురి పెళ్ళి జరిపించి వచ్చి ఆ ముచ్చట్లన్నీ అందరికీ చెప్పింది.

పెళ్ళి జరిగిన మూణ్ణెల్లకు అన్నమ్మ భర్త చనిపోయాడని కబురొచ్చి ఓ అర్ధరాత్రి వెళ్ళి పోయింది. అలా వెళ్ళింది రెండు నెలలయినా తిరిగి రాలేదు. ఇక రాదు అనుకున్నారంతా.

"పాపం అన్నమ్మ ఎప్పుడూ ఒంటరిదే" అని ఒకరంటే –

"మొగుడున్నప్పుడూ ఏం సుఖపడింది గనక" అని మరొకరూ.

ఆ రెండు నెలల్లోనూ ఇంజనీరుగారింట్లో ఇద్దరు పనిమనుషులు మారేరు.

మూడు నెలల తర్వాత ఓ రోజు వచ్చింది అన్నమ్మ. నుదుట్న రూపాయి కాసంత బొట్టు లేదు. దాని స్థానే ఓ మచ్చ ఉంది. ఆమె వెనకాలే కొడుకున్నాడు.

"ఏం జెయ్యాల తల్లీ. నాది కష్టాజీవి పుటకే. పని చెయ్యకపోతే బతుకెలా ఎళ్ళాలా. ఈ ఆవిటోడి బతుకెలా ఎల్లాలా" అంది.

నలుగురి సలహా ప్రకారం వాణ్ణి స్కూల్లో వేసింది. కానీ పట్నవాసపు చదువు వాడికి పడలేదో ఏమో ఆర్నెల్లు తిరక్కుండానే వాడు వాళ్ళూరు వెళ్ళిపోయాడు.

"నాకాడ కన్నా ఆడికి ఆళ్ళక్క కాడే బావుంటాదట. చిన్నప్పుణ్ణించీ దాని పెంపకం లోనే పెరిగేడు మరి. అల్లుడు కూడా వచ్చీమన్నాడు. అందుకని దిగబెట్టేసినాను" అంది. అప్పటికి వాడు ఎనిమిదో తరగతి చదువుకున్నాడు.

"ఎక్కడ సదివితే ఏటి? అదే సదువు గదా. ఆడికి ఆ సదువే ఓ దారి జూపాల. మాలాగ కష్టపడలేని ఆవిటోడు" అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకునేది, కొడుకు గుర్తొచ్చినప్పుడల్లా.

◆ ◆ ◆

"ఓట్ల పండగొస్తందట. మా వూరెళ్ళాల" అందోమారు అన్నమ్మ. లోక్‌సభ ఎలక్షన్లని అమ్మోరి పండగ లాగే చెప్పింది.

"ఏముంటుందన్నమ్మా మీ వూళ్ళో" అంటే,

"అదేటి బాబూ అలగనీసినావు. ఓటెయ్యద్దా? మా జిల్లాల కాణ్ణించి ఓ మనిషి నేనా ఢిల్లీ కంపొద్దా?" అంది అన్నీ తెలిసిన దానిలా.

"నీ ఓటు ఎవరికేస్తావ్ మరి" అనడిగితే

"నానక్కడ లేను గదా. మా వోళ్ళందరూ ఎవులికెయ్యమంటే ఆరికే ఏస్తాను. మంచి చెయ్యాలగాని ఎవ్వరైతే నాకేటి?" అంది.

అయితే ఓట్ల పండగకి వెళ్ళొచ్చిన అన్నమ్మలో అసంతృప్తే మిగిలింది. ఓటెవరికి వెయ్యాలో నిర్ణయించుకుని వెళ్ళే సరికి ఆ ఓటు అంతకుముందే ఎవరో వేసేసేరట.

"రోజులు మునపట్లాలేవు దొంగదార్లు నేర్పినారు. మొగోళ్ళని తాగుబోతుల్ని సేస్తున్నారు" అంది.

మరో ఏడాదికే వచ్చిన అసెంబ్లీ ఎన్నికలకి తన వూరు వెళ్ళకూడదని నిర్ణయానికొచ్చింది అన్నమ్మ.

అన్నమ్మకీమారు పట్నంలో ఓటుంది. తను వుంటున్న గుడిశకో నెంబరిచ్చి ఆమె పేరు రాసుకెళ్ళి ఎలక్షన్లకి రెండు రోజులు ముందు చీటీ కూడా యిచ్చేరు. ఇంజనీరుగారి కుటుంబంతో సహా కార్లో వెళ్ళి తన ఓటు తనే వేసి చక్కా వచ్చింది. ఆ విషయం అందరితోనూ ఆనందంగా చెప్పింది.

ఆ తర్వాత కొన్నాళ్ళకి కొత్త రేషన్ కార్డులివ్వడం మొదలు పెట్టింది ప్రభుత్వం. అందరికీ వచ్చిన రేషన్ కార్డులు అన్నమ్మకి మాత్రం రాలేదు. అన్నమ్మకి పాత రేషన్ కార్డు లేదు. పేర్లు నమోదు చేసుకునేటప్పుడు అన్నమ్మ పాకలో లేదు. ఆమె పాకలో ఎంతమంది ఉంటారో, ఆ యింటి యజమాని ఆదాయమెంతో ఎవరూ చెప్పలేదు. ఈ కారణాలని చూపి దాటేశారు ఉద్యోగులు. అయితే అన్నమ్మ వూరుకోలేదు.

"ఓటేయడానికి పనికొచ్చిందాన్ని రేసను కార్డుకి పనికిరాకపోయేనా" అని కార్డులిచ్చే ఉద్యోగుల్ని నిలదీసింది. ఆమె ప్రశ్నించిన తీరు అందర్నీ ఆశ్చర్యపరిచినా ఆ కాలనీలో ప్రముఖుడైన కంట్రాక్టరుగారు గానీ, ఉన్నత ప్రభుత్వోద్యోగి అయిన ఇంజనీరుగానీ అన్నమ్మ తరపున ఆలోచించి ఆమెకో కార్డును యిప్పించలేకపోయారు.

పండక్కి కొడుకునీ, కూతుర్నీ చూసి రావాలని వెళ్ళిన అన్నమ్మ మరి రాలేదు. అక్కణ్నించి అలాగే పైలోకాలకి వెళ్ళిపోయింది.

అన్నమ్మ చచ్చిపోయిందంటే నమ్మకం కుదరటం లేదు.

ఏ సందేవేళో వచ్చి, 'ఏం బాబూ' అని పలకరిస్తూందేమోననిపిస్తుంది.

జీవితాన్ని నదీ ప్రవాహంతో పోలిస్తే అన్నమ్మ జీవితం అలా పోల్చడానికి సరిపోతుంది. ఎక్కడ పుట్టిందో ఆ మారుమూల పల్లె నుంచీ పట్నం ఎలా వచ్చిందో జీవనోపాధి కోసం ఎలా తిరిగిందో చిత్రంగా పట్నవాసపు జీవితాల్లోకి అల్లుకుపోయింది. అక్కడి వారి దాహార్తిని తీర్చింది. జీవితం సంపాదించి పొట్ట పోసుకుందికే కాదు. నలుగురికీ చేతనైనంత సాయం చేయడానికి కూడా అని నమ్మిందామె. తను నమ్మినదేదో

చేసిందనిపిస్తుంది, ఆమెను గురించి ఆలోచించినప్పుడల్లా.

◆ ◆ ◆

అన్నమ్మ జ్ఞాపకాల్లోనే మిగిలిపోయి అప్పుడే సంవత్సరం దాటి ఉంటుంది.

ఆదివారం ఉదయం పది గంటల వేళ కాలింగ్ బెల్ ఎవరో మ్రోగిస్తే వెళ్ళి చూసాను.

సన్నగా పొడవుగా ఉన్న కుర్రవాడొకడు ఎదురుగా కనిపించేడు.

"నమస్కారం బాబూ"

"ఎవరూ?" అన్నాను పోల్చలేక.

"నేను బాబూ, అప్పన్నని. అన్నమ్మ కొడుకుని" అన్నాడు.

'ఇంతుండేవాడు! ఎలా ఎదిగాడో!' అని ఆశ్చర్యపోతున్నంతలో లోపల్నించి కస్తూరి వచ్చి విషయం తెలుసుకుని –

"ఎప్పుడొచ్చావ్. లోపలికిరా" అంది.

వాడు తలొంచుకుని అక్కడే నిలబడ్డాడు కాని లోపలికి రాలేదు.

"నిన్నొచ్చాను పోస్టుమాస్టరు గారింటికి. ఇవాళ వెళ్ళిపోతాను. మీకో మారు కనపడి చెప్పి పోదామనీ" అన్నాడు నెమ్మదిగా.

"వెళ్దూగాన్లే రా" అంటూ లోపలికి నడిచింది కస్తూరి.

వరండాలోకొచ్చి బల్ల మీద కూర్చున్నాడు. అమాయకత్వం తప్ప అన్నమ్మ పోలికెక్కడా వాడి ముఖంలో కనిపించలేదు. అవిటితనం అలాగే ఉంది.

ప్లేటులో తిండానికేదో తెచ్చిపెట్టింది కస్తూరి. మొహమాటపడుతూనే తిని, ప్లేట్లు కడిగి యిచ్చేడు.

వాడిని చూస్తుంటే బహుశా ఏదైనా సహాయం కోసం యీ వూరు వచ్చాడేమోనని పించింది. వాళ్ళమ్మ కొన్ని ఏళ్ళు పని చేసి, మసలిన ప్రాంతమిది. ఎవరికేనా సాయమే చేసింది గాని ఎవరి దగ్గరా యిది కావాలని అడగలేదామె. అన్నమ్మ పోయాక ఒకట్రెండు మార్లు వీడి గురించి ఆలోచన రాకపోలేదు. అసలే అవిటివాడు. ఎలా బతుకుతున్నాడో అనిపించేది.

వీడు నోరు తెరిచి అడగాలనే గాని తోచిన సాయం చేసేవారున్నారు. అయితే దాంతో వీడి బతుకు గడుస్తుందా? అటువంటి వారి కోసం ప్రభుత్వం ఏదైనా ప్రత్యేక పథకాలు రూపొందిస్తే బావుణ్ణు. ఒకవేళ యీ సరికే వుంటే ఆ పథకాలు యథాతథంగా వారికి నేరుగా అందించే సేవా సంస్థలు వుంటే, ఇటువంటి వారి జీవితాల్లో చిన్న వెలుగు.

"ఏం చేస్తున్నావిప్పుడు" నేను అడగాల్సింది కస్తూరే అడిగింది.

"పదో తరగతి చదివేను. మా వూళ్ళో నేను చెయడానికి పనులేం లేవు" అంటూ వాడు చేసిన ప్రయత్నం గురించి చెప్పేడు.

ఒకట్రెండు మార్లు యీ వూరొచ్చి అన్నమ్మ పనిచేసిన కాంట్రాక్టరుగారిని కలిశాడట.

'నువ్వేం చేయగలవురా. చూద్దాంలే' అన్నారట ఆయన. వాళ్ళ వూరి హైస్కూలు మాష్టారు వీడికో దారి చూపాలని తాపత్రయపడ్డారట. న్యూస్ పేపర్లో పడిన ఉద్యోగ ప్రకటనలకు అప్లికేషన్లు పెట్టించేరట.

"క్రితం నెల పోస్టుమాస్టరుగారి నుండి ఉత్తరమొస్తే వచ్చాను. అక్కతో కలిసి వచ్చాక తెలిసింది. మా అమ్మ అప్పటా అప్పటా పోస్టాఫీసులో దాచుకున్న డబ్బు రెట్టింపై వచ్చిందని. పది వేలొచ్చాయి. బాబుగారే అమ్మ చేత పొదుపు చేయించారట" అన్నాడు వాడు.

ఆశ్చర్యమనిపించింది.

నలుగురు ఆడపిల్లలున్న పోస్టుమాస్టరుగారే ఐదో పిల్లగా అన్నమ్మని చేరదీసి ఆమె కొడుక్కో మార్గం చూపించారనిపించింది.

"ఏం చేద్దామనుకుంటున్నావ్ మరి?" అడిగింది కస్తూరి.

"ఏ కిళ్ళీ కొట్టో, కిరాణా కొట్టో మా వూళ్ళోనే పెట్టమంటాడు మా బావ. మా అక్కకది యిష్టం లేదు. ఇదిగో యీలోగా మా మాష్టారు నా చేత పెట్టించిన బంట్రోతు ఉద్యోగానికి పిలుపొచ్చింది. అందుకే నిన్ననొచ్చేను. పరీక్షయింది. నాలాంటి ఆవిటోళ్ళు నలుగురు. అయితే అందరికంటే నేనే ఎక్కువ బీదోడినీ, అవిటోడినీ మాష్టారుగారు నాతోపాటు వచ్చి ఎవరెవరితోనో మాట్లాడేరు. నిన్న రాత్రే చెప్పేరు. ఆ ఉద్యోగం నాకే యిచ్చినట్టు" అన్నాడు వాడు. వాడి కళ్ళల్లో అంతకు ముందులేని మెరుపేదో కనిపించింది.

"ఆ శుభవార్త చెప్పడానికి వచ్చావన్న మాట. బావుంది టీ తాగి వెళ్దువుగానుందు" అంటూ లోపలికి వెళ్ళింది కస్తూరి.

అన్నమ్మ లాంటి మనిషిని మరి చూడం! అది నిజం!!

అయితే అన్నమ్మ చచ్చిపోలేదు. బాహ్యరూపం కనుమరుగైనా తన నెరిగిన మనుషుల మనుషుల్లోనూ, ఆమె మసలిన వాతావరణంలోనూ, కలుషితమవని యీ పట్నవాసపు మారుమూల ప్రదేశాల్లోనూ పిల్లగాలుల్లోనూ అణుమాత్రంగానైనా మారి ఉందేమోననిపించింది.

భూమి అట్టడుగు పొరల కింద పారే జల లాంటి మంచితనమేదో, ఉపకార స్వభావమేదో మనిషి అంతరంగంలోనూ వుండాలి. ఆ తడి లేనప్పుడు మోడువారిన చెట్టుకీ, ఎండిన బీడు భూమికీ, మనిషి బతుక్కీ తేడా ఉండదేమో!

*రచన మాసపత్రిక నిర్వహించిన 'దువ్వూరి శారదాంబ స్మారక కథల ఏ*

*బహుమతి పొందినది (సెప్టెంబరు 1999)*

*వాహినీ బుక్ ట్రస్ట్ ప్రచురణ 'కథామహాల్*

*కథా సంకలనంలో చేర్చబడింది (అక్టోబర్ 1999)*